క్లుప్తంగా

చిన్నారులకు వైద్యపరీక్షలు


చిన్నారులను పరీక్షిస్తున్న డాక్టర్ దినకర్

అమరాపురం: స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 100 మంది చిన్నారులకు డాక్టర్ దినకర్ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతపురం ప్రభుత్వాసుపత్రిలో విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ దినకర్ తాను పుట్టిన గడ్డ అమరాపురంలో నెలకోసారి వైద్య సేవలు అందిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పురిటి, చిన్నపిల్లలకు 100 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయానికి సంబంధించిన హుండీ కానుకలను మంగళవారం ఉదయం 10:30 గంటలకు లెక్కించడం జరుగుతుందని ఆలయ కార్యనిర్వహణాధికారి నరసింహమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి


రత్నమ్మ (ఫైల్)

లేపాక్షి: మండలంలోని పులమతి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ రత్నమ్మ క్యాన్సర్‌తో బాధపడుతూ ఆదివారం ఉదయం మృతి చెందారు. 2001 నుంచి 2005 వరకూ సర్పంచ్‌గా పని చేశారు. కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ వివిధ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నారు. పరిస్థితి విషమించడంతో రత్నమ్మ మృతి చెందినట్లు భర్త నారాయణప్ప తెలిపారు.

ఆట పాటలతో విజ్ఞానం


కేరమ్స్ ఆడుతున్న విద్యార్థులు

అమరాపురం: విద్యార్థులు ఆట పాటలతో పాటు విద్య నభ్యసిస్తే విజ్ఞానాభివృద్ధి కలుగుతుందని ఉపాధ్యాయుడు సిద్దేశ్వర తెలిపారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞానశిబిరానికి హాజరై ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా కేరమ్స్, చెస్, క్విజ్ తదితర పోటీలలో పాల్గొనడం వల్ల పోటీతత్వం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఇబ్రహీం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గుడిబండ: జంబులబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సుధాకర్ అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 250 మందికి వైద్య చికిత్సలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు డాక్టర్ సుధాకర్ తెలిపారు.

జోరుగా చెరువులో పూడికతీత పనులు


పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

మడకశిరరూరల్: ఆమిదాలగొంది చెరువులో ఉపాధి నిధులతో చేపట్టిన పూడికతీత అమృత్ సరోవర్ పనులు ఆదివారం జోరుగా సాగాయి. ఇటీవల డ్వామా పీడీ రామాంజనేయులు చెరువులో అమృత్ సరోవర్ పనులను పరిశీలించి పనులు నత్తనడకగా జరుగుతున్నాయని సిబ్బందిపై మండిపడ్డారు. దీంతో మండలంలోని 5,500 మందిపైగా ఉపాధి కూలీలతో చెరువులో పూడికతీత పనులను చేయించారు. ఒకే రోజే ఇంత మంది కూలీలు పనులు చేయడంతో చెరువులో పండుగ వాతావరణం ఏర్పడింది.

సేద్యపు పనుల్లో రైతన్నలు బిజీ


పొలంలో దుక్కిదున్నుతున్న రైతు

రొద్దం: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. మండల వ్యాప్తంగా ఇటీవల వర్షాలు కూడా భారీగా కురిశాయి. పదును వర్షం కురవడంతో రైతులు పొలంబాట పట్టారు. ఎద్దులతో కొందరు, ట్రాక్టర్లతో కొందరు రైతులు పొలాలను దుక్కులు దున్నిస్తున్నారు. మహిళా కూలీలు పొలాల్లో ఎండు పుల్లలు ఏరివేస్తుంటే, మరికొందరు ఎరువులు చల్లి సేద్యం చేయిస్తున్నారు.

భానుడి భగభగలు


పని చేయాల్సిందే: పెనుకొండ రహదారిపై పని చేస్తున్న కూలీలు

హిందూపురం: వేసవి తాపానికి ప్రజలు అల్లాడిపోతున్నారు. హిందూపురంలో 40.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 11 గంటలు దాటితే ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి నెలకొంది. ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు చల్లటి పానీయాలు తాగేస్తున్నారు.

మడకశిరరూరల్: ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది వేసవి కాలం ప్రారంభం నుంచి మడకశిర నియోజకవర్గంలో ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు నానాతంటాలు పడుతున్నారు. ఉదయం 9 గంటలకే సూర్యప్రతాపం పెరగడంతో ప్రజలు ఇళ్లు, చెట్లను ఆశ్రయిస్తున్నారు. గొర్రెలు, మేకలు, పశువులు ఎండ వేడిమిని తట్టుకోలేక చెట్ల కింద సేదతీరుతున్నాయి.


చల్లదనం కోసం వడపప్పు, మజ్జిగ సేవనంతో జనం బిజీ


హిందూపుం: బండి మీదైనా గొడుగు లేకుండా వెళ్లలేము బాబోయ్..


మడకశిర మండలం గుడ్డంపల్లి వద్ద చెట్ల కింద విశ్రాంతి తీసుకుంటున్న జనం


ఎండ వేడిమి తాళలేక మేకలను చెట్ల కిందకు వదిలిన కాపరులు


పెనుకొండలో ఫ్రూట్ జ్యూస్ విక్రయాల జోరు..



వేంకటేశ్వరుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే


వెంకన్న దర్శనం అనంతరం ఎమ్మెల్యే శంకరనాయణతో నాయకులు

పెనుకొండ: తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని ఎమ్మెల్యే శంకరనారాయణతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే వెంట ముఖ్యనాయకులు రామ్మోహన్‌రెడ్డి, శంకరరెడ్డి, డీసీ, అశోక్, వెంకటరత్నం, నారాయణరెడ్డి, నారాయణరెడ్డి, రాజారెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించండి

హిందూపురం: ప్రజా సంక్షేమం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృఢ సంకల్పంతో అర్హత గల ప్రతి కుటుంబానికి పథకాలు అందించి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని బాలంపల్లి పంచాయతీ చెర్లోపల్లి గ్రామంలో మమేకం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధుమతిరెడ్డి మాట్లాడుతూ.. కుల, మత పార్టీలకు అతీతంగా రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. జగన్‌కు మరొక్కసారి ముఖ్యమంత్రిగా అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, ఎంపీటీసీ కృష్ణవేణి, ఓబుళరెడ్డి, సింగల్ విండో రంగనాథ్, సర్పంచులు నంజప్ప తదితరులు పాల్గొన్నారు.


చెర్లోపల్లిలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి

షార్ట్ సర్క్యూట్‌తో కార్యాలయం దగ్ధం


కార్యాలయంలో దగ్ధమైన ఫైళ్లు

పావగడ: పొన్నసముద్ర గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి ఆస్తినష్టం వాటిల్లింది. ఈ ప్రమాదంలో ముఖ్యమైన ఫైళ్లు, కంప్యూటర్లు, పరికరాలు, బీరువాలు, ఫర్నీచర్ కాలిపోయాయి. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు యత్నించినా ఫలితం లేకపోయింది. చివరకు అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. పీడీఓ శివానంద సాతిహాళ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.


దగ్ధమైన ఇంటిని చూపిస్తున్న బాధితురాలు మహేశ్వరి

ఇల్లు దగ్ధం..

పావగడ: పట్టణంలోని గుట్టహళ్లిలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైంది. వివరాలు...కోర్టు వెనుక భాగం గుట్టహళ్లి ప్రాంతానికి చెందిన మహేశ్వరి శనివారం రాత్రి దేవుని పూజ చేయడానికి దేవుడి చిత్రపటం వద్ద దీపం వెలిగించింది. అయితే ఆ దీపం కిందకు పడి దుస్తులు అంటుకుని ఆ మంటలు ఇల్లంతా వ్యాపించి వస్తువులు, పరికరాలన్నీ కాలి బూడిదైపోయాయి.

మడకశిర బైపాస్ కెనాల్ అలైన్‌మెంట్ సర్వే పూర్తి

- రేపోమాపో ప్రభుత్వానికి నివేదిక

మడకశిర: మడకశిర బైపాస్ కెనాల్ నిర్మాణానికి సంబంధించిన అలైన్‌మెంట్ సర్వే పూర్తయింది. ఓ ప్రైవేట్ ఏజెన్సీ సర్వే చేసింది. ఈ సర్వే నివేదికను రేపోమాపో ప్రభుత్వానికి అందించనున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. పెనుకొండ మండలం అడుదాకలపల్లి నుంచి మడకశిర మండలం అగ్రంపల్లి వరకు దాదాపు 15 రోజుల పాటు సర్వే చేశారు.రాష్ట్ర ప్రభుత్వం మడకశిర నియోజకవర్గంలోని అన్ని చెరువులకు కృష్ణాజలాలను అందించడానికి వీలుగా బైపాస్ కెనాల్ మంజూరు చేసింది. ఇందుకోసం రూ.214.85 కోట్ల నిధులను కూడా మంజూరు చేసింది. ఈకెనాల్‌ను వేగవంతంగా నిర్మించడానికి అవసరమైన అన్ని ప్రక్రియలను కూడా ప్రభుత్వం పూర్తి చేసింది. చివరగా అలైన్‌మెంట్ సర్వేను పూర్తి చేయడంతో రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది. ఈ అలైన్‌మెంట్ సర్వేని ప్రభుత్వం ఆమోదిస్తే కెనాల్ నిర్మాణానికి లైన్ క్లియర్ అవుతుంది. ఈసర్వే ప్రకారం రెండు పంప్ హౌస్‌లు, రెండు బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంటుందని తెలిసింది. అదే విధంగా కెనాల్ ఏర్పాటు చేసే మార్గాన్ని గుర్తించినట్లు సమాచారం. ప్రభుత్వం అలైన్‌మెంట్ సర్వేకి ఆమోద ముద్ర వేస్తే మిగిలిన ప్రక్రియలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హెచ్ఎన్ఎస్ఎస్ డీఈ వెంకటరమణ సాక్షికి తెలిపారు.

గంగమ్మకు బోనాల ఊరేగింపు

ఓడీ చెరువు: మండలంలోని వంచిరెడ్డిపల్లిలో ఆదివారం గ్రామ దేవత గంగమ్మకు మహిళలు బోనాలు సమర్పించారు. ఈ ఏడు వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలు బాగా పండాలని కోరుతూ వేడుకున్నారు. బోనాలు సమర్పించిన అనంతరం జంతు బలి ఇచ్చారు. ఈ సందర్భంగా లాయర్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఏటా అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు నరసింహులు, రవీంద్రారెడ్డి, వెంకటరమణ,శివరామిరెడ్డి, మనోహన్ రెడ్డి, ఆదినారాయణ, శేషాద్రి, లక్ష్మీనరసప్ప, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి కార్యక్రమాలు

వైఎస్సార్‌సీపీ బైక్ ర్యాలీ

మడకశిర: టీడీపీ అధినేత చంద్రబాబు అమరావతిలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ సోమవారం మడకశిరలో బైక్‌ర్యాలీ నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో జరిగే ఈబైక్ ర్యాలీ ఉదయం 9 గంటలకు మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమవుతుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు బైక్ ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

విత్తన వేరుశనగ పంపిణీ

మడకశిర: మడకశిర అర్బన్ ఆర్బీకే పరిధిలోని రైతులకు సోమవారం ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే తిప్పేస్వామి విత్తన వేరుశనగ పంపిణీ ప్రారంభిస్తారని ఆర్బీకే ఇన్‌చార్జ్ రాజేష్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు. మడకశిర టౌన్, మల్లినాయకనపల్లికి చెందిన రైతులు ఉదయాన్నే ఆర్బీకే వద్దకు వచ్చి వేరుశనగ విత్తన కాయలను పొందాలని కోరారు. పేర్లు నమోదు చేసుకున్న రైతులు మాత్రమే రావాలని సూచించారు.

ఇంటర్వ్యూలు

రొద్దం: మండలంలోని ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ల పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మండల కేంద్రం లోని ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ తెలిపారు.

ఐపీఎల్ బెట్టింగ్‌పై పోలీసుల దాడులు


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లను చూపుతున్న ఎస్ఐ నరేంద్ర

పరిగి: మండల కేంద్రంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేశారు. ఇద్దరిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.15 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. క్రికెట్ బెట్టింగ్ ఆడిన మరో ఎనిమిది మంది తప్పించుకున్నారని, వారిపైనా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేత ‘పురం’

హిందూపురం టౌన్: బెంగళూరులో ఆదివారం జరిగిన అండర్–10 ఇన్విటేషనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హిందూపురం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో హోస్టింగ్ టీమ్ గౌతమ్స్ ఫుట్‌బాల్ క్లబ్‌తో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ హిందూపురం జట్టు తలపడ్డాయి. హిందూపురం జట్టు 4–0 తేడాతో విజయం సాధించింది. హిందూపురం జట్టులో నోబుల్ మూడు గోల్స్ చేయగా, లవీన్ రిషి ఒక గోల్‌తో సత్తా చాటి విజయఢంకా మోగించారు. ఈ సందర్భంగా గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. మూడు గోల్స్‌తో ప్రతిభ కనబరిచిన నోబుల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ దక్కింది. ఈ సందర్భంగా టీమ్ కోచ్‌లు బీకే మహమ్మద్ సలీమ్, సాయిలతా, అయిషాలు క్రీడాకారులను అభినందించారు.


గెలుపొందిన యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ (హిందూపురం) జట్టు

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

అమరాపురం: హేమావతి గ్రామంలో వెలసిన సిద్దేశ్వరస్వామికి భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి ఉదయం అర్చకులు సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన వివిధ పూలతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. జ్యేష్ఠమాసం, సెలవులు ఉండడంతో మడకశిర నియోజకవర్గం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

రొళ్ల: టీడీ పల్లి గ్రామ సమీపాన అటవీ ప్రాంతంలో వెలసిన సిద్ధేశ్వరస్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌ను గంగా జలంలో అభిషేకించారు. తర్వాత వెండి ఆభరణాలు, పూలతో అలంకరణ చేసి మహామంగళహారతి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. టీడీపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరప్ప కుటుంబ సభ్యులు, గుడిబండ మండలం దిన్నేహట్టి గ్రామస్తులు ఆలయంలో వంటకాలు చేసి భక్తులను సహపంక్తిగా కూర్చోబెట్టి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వర స్వామి

పర్యావరణ పరిరక్షణకు కృషి చేద్దాం

బత్తలపల్లి: ప్రస్తుతం వాతావరణ కాలుష్యంతో నిండిపోయిందని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రైవేట్ వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించారు. బత్తలపల్లి కూడలిలో డ్రైవర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వాతావరణం కాలుష్యం కాకుండా ప్రతి పౌరుడు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలన్నారు. వాతావరణం కాలుష్యం కావడంతో ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం డ్రైవర్లు, ప్రయాణికులతో పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుతామంటూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బత్తలపల్లి పోలీసులు, కదిరి ప్రాంతీయ రవాణా కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్

కల్యాణ మండపానికి పాత్రల వితరణ

అమడగూరు: మండలంలో ప్రసిద్ధిగాంచిన చౌడేశ్వరీ ఆలయానికి అనుసంధానంగా నిర్మించిన చౌడేశ్వరీ కల్యాణ మండపానికి కర్ణాటకలోని ముళబాగిళుకు చెందిన నరసింహప్ప దంపతులు రూ.2 లక్షలు విలువ చేసే వంట పాత్రల సామగ్రి వితరణ చేశారు. ఆదివారం ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తమ రెడ్డికి పాత్రలు, స్టవ్‌లు, గ్రైండర్‌ను అందజేశారు. కాగా దంపతులకు ఆలయ కమిటీ తరపున కృతజ్ఞతలు తెలిపారు.


హిందూపురం టౌన్: ఎస్‌డీజీఎస్ కళాశాలలో సమావేశమైన పూర్వ విద్యార్థులు


లేపాక్షి: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు


గోరంట్ల: ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనంతో సందడి నెలకొంది. 2006–09 బ్యాచ్ ఓపెన్ డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ మిత్రులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. మిత్రులతో కలిసి నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం అధ్యాపకులను సన్మానించారు.

లేపాక్షి: మండలంలోని చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996–97 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి తీపి జ్ఞాపకలను ఒకరికొకరు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుధామణితో పాటు విశ్రాంత ఎంఈఓలు కలీముల్లా, వేణుగోపాల్‌గుప్తా, ఉపాధ్యాయులు కోదండరాములు, విజయకుమారి, పూర్వ విద్యార్థి సంఘం నాయకుడు రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

గోరంట్ల: స్థానిక బాలికల ఉన్నత పాఠశాల 1976–1977 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనమయ్యారు. నాలుగు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు ఒకచోట కలిసి నాటి అనుభూతులు పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువు నాటి గురువులు రఘురామిరెడ్డి, శంకరననారాయణ, గోపినాథరావు, హనుమంతరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటరమణను పూర్వపు విద్యార్థులు ఘనంగా సన్మానించించారు. పూర్వ విద్యార్థులు సురేంద్ర,అప్పిరెడ్డి, అమీర్, రామచంద్ర, కోటిరెడ్డి, శ్రీనాథ్, గంగాధరరెడ్డి, నీలకంఠరెడ్డితో పాటు 50 మంది పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

సేఫ్టీ వాల్‌ను ఢీకొన్న ఇన్నోవా కారు

కనగానపల్లి: మండల పరిధిలోని దాదులూరు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న సేఫ్టీ వాల్‌ను ఇన్నోవా కారు ఢీకొట్టింది. దీంతో ఆ ఐరన్ సేఫ్టీ వాల్ పైపులు కారు ముందు భాగం నుంచి దూసుకెళ్లి వెనుక వైపు నుంచి బయటకు వచ్చాయి. కాని కారులోని ప్రయాణికులు మాత్రం స్వల్ప గాయాలతో త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు ఆదివారం సాయంత్రం కర్నూల్‌కు చెందిన సురేష్ కుమార్ తన కూతురుతో కలసి బెంగళూరు నుంచి కర్నూల్‌కు వెళ్తున్నారు. దాదులూరు వద్ద వేగంగా వస్తున్న కారు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న సేఫ్టీవాల్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.